# ప్రేమంటే ఇదే!

'ప్రేమ' అనే పదం ఆకర్షణకే అంకితం. గుర్తిస్తే... దాన్ని మించిన ప్రేమలు చాలావున్నాయి.

- జయప్రద

అర్ధ శతాబ్ది పాటు నాతోపాటు కలిసి బ్రతికిన ఓ వ్యక్తి మృతశరీరం– నా ముందు అన్ని బంధాలకూ దూరంగా, అన్ని వ్యధలకూ అతీతంగా, ప్రశాంతంగా... పడుకొనివుంది.

తను లేందే బ్రతకలేననుకున్న నాకు– తన హఠాన్మరణం చాలా పెద్ద షాక్!

అయినా... నా గుండె కొట్టుకుంటూనే వుంది. నా మెదడు ఆలోచిస్తూనే వుంది.

•

పావడా, జాకెట్టు వేసుకుని రెండు జడలతో బెరుకు బెరుగ్గా తొమ్మిదో క్లాసులో అడుగు పెట్టాను.

అంతవరకూ పల్లెటూరిలో చదివి, నాన్నగారు నెల్లూరు రావడంతో– అంతవరకూ పెంచుకున్న బాల్య స్నేహాల్ని, ఆ పరిసరాల మీద పెంచుకున్న బంధాల్నీ తెంపుకుని దిగులుగా, బెరుకు బెరుగ్గా నడుస్తూ వెళ్తున్న నన్ను– అందరూ ఎగాదిగా చూస్తున్నారు గానీ, ఎవ్వరూ నావైపు స్నేహంగా చూడలేదు. మూడేళ్లుగా అదే స్కూల్‌లో కలిసి చదివిన వాళ్ళకు నేను పరాయి వ్యక్తిగా కన్పించానేమో..?!

వెనక గేట్లో నుండి ముందుకు పోతూనే వున్నాను... ఇంకో రెండడుగులు వేస్తే మొదటి వరస వస్తుంది.

ఇంతలో... దాటిపోయిన నా చేయి పట్టుకుంది– రెండో రోలో కూర్చొనున్న నిర్మలమైన ముఖంతో, నవ్వే పెదాలతో వున్న ఓ అమ్మాయి.

వెనక్కి తిరిగి చూశాను.

"దా... ఇక్కడ కూర్చో!"

వెనక్కి తిరిగొచ్చి కూర్చున్నాను.

క్షణంలో నా బెరుకు, దిగులూ అన్నీ అదృశ్యమైపోయాయి. ఆ క్షణంలో ఎంత మహత్తు ఉందో! ఆమె అంటే చాలా ఇష్టం కలిగింది.

"నువ్వు కొత్తగా చేరావా?"

"ఆ..."

"ఏ స్కూలు నుంచి వచ్చావు?"

"గండవరం ప్రైమరీ స్కూలు!" కాస్త సిగ్గుపడుతూ చెప్పాను.

వీళ్ళంతా పట్నం మనుషులు.

"నీకు ఫ్రెండ్స్ ఉన్నారా?"

"ఊ..."

"ఎవరు?"

"పద్మావతి, నిర్మల, ఇందిరా దేవిడ్..." గర్వంగా అన్నాను.

ఆ తర్వాత టీచర్ రావడం, మా సంభాషణ అంతటితో ఆగిపోవడం జరిగిపోయింది.

మర్నాడు నన్ను మొదట పలకరించిన వ్యక్తి సౌజన్య. ఆమె కూడా ఫోర్తు ఫారమే! ఆ తర్వాత చాలామంది పలకరించి ఉంటారు. కొంతమంది అతిదగ్గరగా వచ్చిన వాళ్ళున్నారు. కానీ, నా మనసుకు దగ్గరగా వచ్చింది మాత్రం- మొదట నా చెయ్యి పట్టుకుని ప్రక్కన కూర్చోబెట్టుకుని నా భయం పోగొట్టిన అమ్మాయే! ఆమె పేరు... పద్మ.

"మా ఇంటికి రాకూడదా జయా!"

ఒకరోజు నన్ను ఆహ్వానించింది పద్మ- చక్కటి చిరునవ్వుతో.

నేను తిరిగి మా ఇంటికి ఆహ్వానించలేదు. అమ్మ ఏమన్నా అంటుందని భయం.

"ఎక్కడ ఇల్లు?"

"న్యూ టాకీస్ ఎదురుగా ఓ పెద్ద వేపచెట్టు కింద."

"సరే..."

వాళ్ళ నాన్నగారి పేరన్నా తెలుసుకోలేదు నేను. ఈరోజుల్లో ఇంత అమాయకంగా వున్నారా పిల్లలు?!

●

ఆ మర్నాడు... ఆదివారం!

నేను, మా చెల్లి జమున కాళ్లకు చెప్పులు కూడా వేసుకోకుండా, నా కొత్త స్నేహితురాలి ఆహ్వానానికి ఉబ్బితబ్బిబ్బయిపోతూ... బయల్దేరాం. న్యూ టాకీస్‌ని తేలిగ్గానే గుర్తుపట్టేశాం. కానీ, ఆ చుట్టుప్రక్కల మాకెక్కడా ఇల్లు కన్పించలేదు. కన్పించిన వేపచెట్టు దగ్గరకల్లా వెళ్లాం. ఏ వేపచెట్టూ మాకు అడ్రసు చెప్పలేదు.

మర్నాడు మా ఎక్స్‌పెడిషన్ గురించి పద్మతో చెప్తే... ఆమె నొచ్చుకుంది.

"అయ్యోఁ... మీ కాళ్లు కాలుంటాయ్!" అంది.

ఆఖరి క్లాసు అయిపోగానే... నన్ను, జముననూ వెంటబెట్టుకుని వాళ్ళింటికి తీసుకెళ్లింది.

ఆ ఇల్లు చూశాక- మా తెలివితక్కువతనానికి ఎంత చిన్నబుచ్చుకున్నామో! పద్మ చెప్పినట్టు న్యూ టాకీస్ ఎదురుగా వేపచెట్టు క్రిందే వాళ్ళిల్లు. కాకపోతే మాలాగ కాంపౌండ్ వాల్ లేదు వాళ్ళకి. అందుకే గుర్తుపట్టలేకపోయాం. చిత్రం ఏమంటే... ఆ ఇంటికి చాలామార్లు వచ్చాం మేము. వాళ్ళ నాన్నగార్కి ఓ చిల్లర అంగడి ఉండేది. మేము మా అమ్మమ్మగారింట్లో వుండి థర్డ్‌ఫారం పూర్తిచేస్తున్న రోజుల్లో- ఎప్పుడైనా నెల్లూరు వస్తే... ఆయన అంగడికి వచ్చి చాక్లెట్లు కొనుక్కునేవాళ్ళం. ముఖ్యంగా రాతిబిళ్ళలకు వెంకన్న అంగడి ప్రసిద్ధి! నేను పెద్దదాన్నయిపోయాక కూడా అవి దొరికితే తినాలనే కోర్కె నాలో ప్రబలంగా చాలాకాలం ఉండింది. ఫేషన్ ముదిరిపోయి వెంకన్న కూడా రాతిబిళ్ళలు చేయడం మానేశాడు.

ఒకసారి మా 'ఎ.బి.యమ్' హైస్కూల్లో టీచర్ జమ్మాయమ్మ మాకు ఫోటోలు తీస్తామన్నారు. మాకు ఎంత సంబరమయిందో! రేగిపోయిన తలలు సరిచేసుకునేవాళ్ళు సరిచేసుకుంటున్నారు. ఆరోజు మా పద్మ మంచి పావడా కట్టుకురాలేదు. నేను హడావుడిగా పద్మను తీసుకుని మా ఇంటికి పరుగెట్టాను. మా ఇల్లు స్కూల్‌కి దగ్గర. నా పట్టు పావడా ఇచ్చాను. నా జాకెట్టు పట్టలేదు. నా పావడా మీద తన జాకెట్టే వేసుకుని, స్కూల్‌కి పరుగెడ్తే... ఏముందీ? 'ఫోటో ప్రోగ్రామ్' అయిపోయింది. మాకు చాలా దిగులేసింది. దాన్ని దిగులనకూడదు. ఏదో పోగొట్టుకున్నంత బాధ.

మా బాధను అర్థంచేసుకున్నట్టు ముందురోజు రానివాళ్ళకి మర్నాడు జమ్మాయమ్మ టీచరు ఫోటోలు తీశారు. ఆ ఫోటో ఇప్పటికీ నా ఆల్బమ్‌లో మొదటిపేజీలో వుంది.

నాకోసం ఒకరోజు పద్మ మా ఇంటికి వచ్చిందట!

నాకు తెలీదు. మా అమ్మ మేడమీద నుండి దిగివచ్చి, "ఆ అమ్మాయి ఎవరు జయా... గంట నుండి గేటు బయట ఉంది? మీ స్కూలా?" అని అడిగింది.

అప్పుడు అమ్మ ముఖంలోకి చూశాను నేను. ఆ ముఖంలో కోపం లేదు.

"వెళ్లు... వెళ్లి లోపలికి పిల్చుకురా!" అంది మా అమ్మ.

పరుగెట్టాను బయటకు.

నాకు తెలుసు- ఎవరైనా నాకోసం వచ్చుంటే... అది 'పద్మే' అయ్యుంటుంది!

నా ఊహ నిజమైంది. బయట పద్మ ఓపిగ్గా నిల్చోనుంది. భుజం మీద చెయ్యివేసి లోపలికి తీసుకొచ్చాను.

నాకే ఆశ్చర్యం!! అమ్మ ఏమీ అనలేదు సరికదా... "దామ్మా!" అని ఆదరంగా ఆహ్వానించింది. నేను మా అమ్మను పొరబాటుగా అర్థంచేసుకుని- నా స్నేహితురాల్ని ఇంటికి పిలవనందుకు..., పిలవకపోయినా తానే వచ్చినందుకు సిగ్గుపడ్డాను.

పద్మలో ఇలాంటి స్తిమితం చాలామార్లు నన్ను విస్తుపోయేలా చేసేది.

పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టే మార్గంలో అమ్మ "ఏం స్నేహితులు? ఏం పుస్తకాలు?' అని తిట్టేది. అలా తిడ్తుందనీ... తిట్టే పద్మ బాధపడ్తుందని భయపడి ఇన్నాళ్లూ తనని ఇంటికి పిలవలేదు. పాపం... పిలవకపోయినా వచ్చింది... ఆ తర్వాత మా అమ్మ మా స్నేహాన్ని ఎప్పుడూ కాదనలేదు.

ఫిఫ్త్ ఫారం తప్పింది పద్మ!

నాకు చాలా దిగులేసింది. రెండు సంవత్సరాల పాటు ఒకే బెంచీలో కూర్చున్న మాకు ఇది ఒక రకమైన ఎడబాటే!

కానీ, ఆ ఎడం మమ్మల్ని దూరం చేయలేదు. ఇద్దరం కాంపౌండ్‌లో కలుసుకునే వాళ్ళం... తేగలు, ఐస్‌ఫ్రూట్స్ కొనుక్కునేవాళ్ళం. సినిమా యాక్టర్స్‌కి లెటర్స్ వ్రాసి, వాళ్ళు ఫోటోలు పంపితే... పెద్ద ఘనకార్యం చేసినట్టు ఫీల్ అయ్యేవాళ్ళం. మాతోపాటు మరో ఇద్దరు స్టూడెంట్స్ కూడా ఈ హంగామాలో పాల్గొని ఆనందించేవాళ్ళు. అయితే వాళ్ళు ఆనందాన్ని వెతుక్కుంటూ బెంచీలు మారుతుండేవాళ్ళు... ఎప్పటికప్పుడు.

స్కూల్ ఆఖరిరోజు మాకు ఫేర్‌వెల్ పార్టీ ఇస్తుంటే... మా అందరికీ ధారాపాతంగా కన్నీళ్లు... పుట్టింటి నుంచి శాశ్వతంగా అత్తింటికి పోతున్నట్టు! తలచుకుంటే ఇప్పుడు నవ్వొస్తుంది.

నేను ప్రీ-యూనివర్శిటీ కోర్స్‌కి తిరుపతి వెళ్లి చదువు పూర్తిచేసుకుని, ఎన్.సి.సి. క్యాంప్ కెళ్లి అక్కడనుండి వస్తూ మొదట దిగింది... మా పద్మ ఇంట్లోనే! ఆ తర్వాత నేను విశాఖకు మెడిసిన్‌కి వెళ్లాక కూడా మా స్నేహం చెక్కుచెదరలేదు. తన పెళ్ళికి నేను ఓ ఉంగరం పంపిస్తే... తను డబ్బా నిండా స్వీట్స్ పంపింది. అక్కడ నా స్నేహితులందరికీ ఆమె సుపరిచితురాలే!

అలాగే... ఇక్కడ మా బంధువులందరికీ చిన్నా పెద్దా తేడా లేకుండా 'పద్మక్క'గా పరిచితురాలే!

●

**89** సంవత్సరాల వయసులో కూతురు ఆసరాతో తప్ప- తన పనులు చేసుకోలేని అనారోగ్యపు వెంకన్న ఏడుపు శబ్దంతో తేరుకున్నాను.

ఓ నిమిషం టైమ్‌లో యాభై వసంతాల వెనక్కు వెళ్లి ఆ తీపిగుర్తుల్లో నుండి... ఆ సజీవస్మృతుల నుండి... ఆ తెగిన జ్ఞాపకాల నుండి తిరిగి ఈ విషాదంలోకి వచ్చాను.

'పద్మ లేకపోతే నేను బతగ్గలనా?' అని ఎన్నో వందలసార్లు అనుకున్న నాలో- ఇంకా ఈ లౌకిక చింతన ఏమిటో..?!

"పదమా... పదమా!" అని ఏడుస్తున్నారాయన. అది ఏడుపు శబ్దంలా లేదు. బోసినోటి నుండి వచ్చిన పిగిలీ శబ్దంలా వుంది.

'ఇతను చనిపోయి ఉండకూడదా..?!' అనే అవాంఛనీయ అభిలాష అక్కడవున్న అందరిలోనూ కలిగింది. కొందరు ఆయన ముఖాన్నే అన్నారు కూడా!

అందుకు ఆయన 'అలా జరిగుంటే ఎంత బావుండేది!' అన్నట్టు క్షణంసేపు ఏడుపు ఆపి, తన సంతోషం తాలూకు భావాన్ని వ్యక్తీకరించారు.

మరోప్రక్క పద్మ భర్త రామ్మూర్తిగారు రిటైర్డ్ టీచర్... గుండె ప్రాంతంలోనే ఏడుపు ఆవిరైపోగా- ఎండిపోయిన గాజుకళ్ళతో పద్మ విగత శరీరం వైపు చూస్తున్నారు.

నా కళ్ళు ఆయన కోసం కూడా వర్షిస్తున్నాయి కానీ, నా మెదడు మాత్రం స్పృహ కోల్పోవడం లేదు. పద్మలేని జీవితాన్ని ఊహించలేకపోతున్నాను. ఎంత స్వార్థపరురాల్ని నేను?!

'పద్మా! ఎప్పుడూ నా విషాదాలలోనే పాలుపంచుకొనేదానివి... సంతోషంలో కంటే! సరదాల కోసం ఎవరైనా దొరుకుతారు. నా విషాదంలో ఇక ఓదార్చడానికి నీలాటి మరో వ్యక్తి నాకే కాదు, ఇంకెవ్వరికైనా దొరుకుతారా అసలు?'

వద్దనుకున్నా స్వార్థపుటాలోచనలే! వెళ్ళిపోయిన ఆమె గురించి కంటే బ్రతికున్న నా గురించే నేను ఎక్కువ ఆలోచిస్తున్నాను... వ్యథ పడ్తున్నాను... ఏడుస్తున్నాను.

అక్కడవున్న అందరూ 'ఇల్లాంటి ముత్తయిదువు చావు ఎంతమంది కొస్తుంది? క్షణంలో రాలిపోయింది... ఎంత అదృష్టం చేసిందో..?!' అని అంటున్నారు.

నాకు ఒక్కప్రక్క నిజమే అన్పిస్తోంది. కానీ, మరోప్రక్క ఆమెకు ఈ 'హార్ట్ అటాక్' రాకుండా ఇంకా బ్రతికుంటే బావుణ్ణనిపిస్తోంది.

"అత్తమ్మా..." నా భుజంమీద చెయ్యి వేసింది దివ్య ఓదార్పుగా.

క్షణంలో క్షణంసేపటిలో నేను మరలా గతంలోకి వెళ్ళిపోయాను.

'లేడీస్‌లో పెళ్ళిళ్ళయ్యాక ఇలా కొనసాగే స్నేహం చాలా అరుదు. మీకే కాదు, అలాంటి స్నేహితురాలు మరెవరికీ దొరకరు అత్తమ్మా!' అనేది మా దివ్య.

ఇది అక్షర సత్యం!

తను నాకోసం మాత్రమే వారానికి రెండు మార్లు వచ్చేది. నా దగ్గర ఏదో ఆశించి ఏనాడూ రాలేదు. కనీసం ఒకపూట అన్నం కూడా మా ఇంట్లో తినలేదు. తను బ్రాహ్మణ వంశంలో పుట్టింది. ఆ ఆచారాలను కడదాకా పాటించింది. కనీసం ఆ ఆచారాలు కూడా మా స్నేహాన్ని దూరం చేయలేదు.

చిన్నప్పుడు- చాలా చిన్నప్పుడు... వాళ్ళమ్మ- ఆమె పేరు నాకు తెలియదు. ఆమెను అందరితో పాటు పద్మ కూడా "ఊచి" అనే పిల్చేది. 'అమ్మా...' అని అనగా నేను వినలేదు. ఆమె మాత్రం- నన్ను వంటింట్లోకి రానిచ్చేది కాదు. మరలా భోంచేయకపోతే ఊర్కొనేదీ కాదు.

వరండాలోనే అన్నం పెట్టేది. తిన్నాక ఆ ఆకు నేనే తీసి వీధిలో వేయాలి. ముఖం తలుపు చాటున ఉంచుకుని, చేతులు మాత్రం బయటపెట్టి, ఆకు విసిరేసేదాన్ని. ఆ చిన్నతనంలో కూడా స్వంత ఆకు ఎత్తివేయడానికి ఎంత చిన్నతనమో..?!

తర్వాత తర్వాత వంటింటి గుండా మిఠాయిలుండే రూములోకి పోనిచ్చేది. అదో ఆనందం! ఈనాడు కోటి ఇచ్చినా రాని ఆనందం!!

పద్మ 'తుదిప్రయాణానికి' తొందరపెడ్తున్నారు.

మనిషి విలువ ఇంతేనా? ఈ మాత్రానికేనా... 'నాదీ, నేను' అనే స్వార్థంలో నీలుగుతాం? 'పద్మ' ప్రాణం పోగానే 'కట్టె' అయిపోయిందా? 'నా ఇల్లు, నా సంసారం' అన్న పద్మ ఇప్పుడు పలకదేం? ఒక్క వారంరోజులు ఆమె రాకపోతే పిచ్చిదానిలా అయిపోయే నాకు- ఇప్పుడు పిచ్చి పట్టదేం..?!

నా కళ్ళలో కన్నీరు ఉబికి, చెంపల మీదుగా జారుతోంది. సభ్యత కోసం అణుచుకోవాలనుకుంటున్నా ఏడుపు ధ్వని గొంతును చీల్చుకురావడానికి ప్రయత్నిస్తోంది. ప్రక్కకు తిరిగి కన్నీళ్లు తుడుచుకుంటున్నా... ఊరుతూనే వున్నాయవి.

"పాపం... మంచి స్నేహితులు!" అంటున్నారెవరో.

'నిజమా? మాది మంచి స్నేహమా?' ఎప్పుడూ అనుకోలేదలా. నా జీవితంలో పద్మ... ఆ జ్ఞాపకాలూ... సహజం అన్పించేది నాకు. తన జీవితంలో నేనో భాగం... తను తింటే నాకు సంతోషం... నేను సుఖంగా ఉంటే తన కిష్టం. నేను చూసిందల్లా తనకి చూపించాలని... నా సరదాలను తనతో పంచుకోవాలని... ఈ భావాన్ని ఏమంటారు? ప్రేమా? అవును. ప్రేమ కాకపోతే ఈ కన్నీళ్లెందుకు వస్తాయి? ఒక ఆడ, మగ మధ్యవుండే కొన్నాళ్ల స్నేహాన్నే 'ప్రేమ' అంటున్నాం కదా! మరి, మామధ్య ఇన్నేళ్ల స్నేహం 'ప్రేమ' కాకపోతుందా?

నేను కారులో వాళ్ళ ఊరు 'కమ్మపాళెం' వెళ్తే నాకు పెట్రోలు ఖర్చవుతుందని- ఎండా, వానా అనుకోకుండా నాకోసం బస్‌లో వచ్చే పద్మ ప్రేమను ఏమంటారు?

ఒకరిని ఒకరు కావాలనుకోవడం 'ప్రేమ' అయితే... అవకాశవాదం, స్వార్థచింతన లేని స్నేహం 'ప్రేమ' అయితే... మాదీ ప్రేమే! అది 'అర్థ శతాబ్దపు ప్రేమ.'

'పద్మా... ఐ లవ్ యు!'

ఇప్పుడు- నాలుగు రోజుల్లో ప్రేమించుకుని, తల్లిదండ్రుల్ని కాదనుకుని వెళ్లిపోయి, పెళ్ళయ్యాక ఒకరితో ఒకరు సర్దుకోలేక 'విడిపోయే ప్రేమ'లాంటి ప్రేమ కాదు మాది.

తొమ్మిదో తరగతిలో రెండో బెంచీలో కూచుని, నా చెయ్యి పట్టుకుని "దా... ఇక్కడ కూర్చో!" అని పద్మ అన్న క్షణమే నా తొలిప్రేమ ప్రారంభమయింది.

నిన్నటిదాకా ఇద్దరం ఒకటిగా మెలిగాం. ఈరోజు ఒకరు రాలిపోయారు. రేపు నేను రాలిపోతాను. కానీ, మా 'ప్రేమ చరిత్ర' ఈ తరంతో పరిసమాప్తం కాదని నేను అనుకుంటున్నాను. ఛాందసాలు వంశపారంపర్యంగా వస్తున్నట్టే 'ప్రేమంటే... ఇదే!' అని అందరూ గుర్తుగా చెప్పుకుంటారు. నాకు తెలుసు. మా ప్రేమ అందరి మనసుల్లో శాశ్వతం.

'పద్మా! ఒక్కసారి తిరిగి జీవించు. నీకోసం తపిస్తున్న ఇంతమందిని చూసేసి, తృప్తిపడి, మరలా మరణించు..' నా మనసు పిచ్చిగా ఆక్రోశిస్తోంది.

ఎవరో ప్రక్కకువచ్చి నిలబడినట్టు అన్పించి తలెత్తాను.

"మీరు మీ స్నేహితురాలు లేదని మమ్మల్ని మరచిపోతారు కాబోలు!"

చప్పున లేచి నిల్చున్నాను. రామ్మూర్తి కళ్ళల్లో తడి!

ఆ మాట అతను స్వార్థంతో అనలేదు. భార్య మృతి తాలూకు విషాదం అతని మనసును బాగా బలహీనపరచినట్టుంది. లేకపోతే ఇన్నేళ్లల్లో ఏనాడూ నాతో అంత చనువుగా మాట్లాడింది లేదు. ఎంతో నిస్వార్థపరుడు ఆయన.

ఎప్పుడైనా, ఎలాంటి పరిస్థితుల్లో అయినా– 'పద్మని రెండు రోజులు పంపించరా?' అని అడిగితే చాలు– వెంటనే పంపించేవారు. ఆయన ఒంటరిగా ఎన్ని ఇబ్బందులు పడ్డా పద్మ ఆనందాన్ని కాంక్షించే మనిషి. ఒకరి ఆనందాన్ని కాదనలేని సంస్కారి.

పద్మను తీసుకొచ్చి నా దగ్గర వదిలి తను మాత్రం ఓర్పుగా ఎన్ని గంటలైనా సరే... ఎక్కడెక్కడో తిరిగొచ్చి, సాయంత్రానికి తీసుకెళ్లేవారు పద్మను.

సినిమాకు టిక్కెట్లు కొనిచ్చి, తాను మాత్రం తన ఫ్రెండ్స్‌తో గడిపి తిరిగివచ్చేవారు.

– ఇలాంటి సంఘటనలు మా జీవితంలో కోకొల్లలు!

ఒకసారయితే మేము టూర్‌కి ప్రయాణమవుతూంటే... ఇద్దరూ వచ్చారు.

"నేను పద్మను కూడా తీసుకెళ్తాను..." అని అంటే –

"ట్రెయిన్ ఎన్ని గంటలకు?" అని మాత్రమే అడిగి, హడావిడిగా తను ఊరుకెళ్లి పద్మ బట్టలు తెచ్చి స్టేషన్‌లో అందించిన వైనం నేను మర్చిపోలేదు.

ఒక్కమాటలో చెప్పాలంటే... అతని సహకారం లేకపోతే మా స్నేహం కొనసాగేదే కాదు. మా స్నేహంలో పది పోగులు ఉంటే... అందులో తొమ్మిది పోగులు ఆయన సహకారంతోనే అల్లుకుని ఉండేవి. అదే మాట ఆయనతో మనస్ఫూర్తిగా అని, "మిమ్మల్ని మర్చిపోతే నా అంత కృతఘ్నురాలు మరొకరుంటారా?" అన్నాను.

ఇదే మాట మా శ్రీవారు కూడా అన్నారు... మా బంధువర్గం సమస్తం అంది.

రామ్మూర్తిగారిని ఎవరో పిలిచారు...

గుండెల్ని వణికించే ఇంత దుఃఖంలో కూడా నాకు అర్థమయింది... నా స్నేహితురాలి విగత శరీరం ఆఖరి ప్రయాణానికి సిద్ధమైందని!

పట్టుత ముసుగులో గొంతు దగ్గర భద్రంగా దాచుకున్న నా కన్నీటికుండ బ్రద్ధలయింది.

●

'కథాకేళి' మాసపత్రిక ... జూన్' 2007 సంచికలో ప్రచురితమైన కథ